## స్వర్ణాంధ్ర మెకానికల్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకునికి డాక్టరేట్

**నరసాపురం :** మండలంలోని సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పత్సమట్ల సత్యనారాయణరాజుకు ఒడిశాలోని గుణుపూర్ గైట్ యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. స్ట్రెంత్ అండ్ థర్మల్ అనాలసిస్ ఆఫ్ సాండ్ విత్ పైప్ ఫర్ డీప్ వాటర్ అప్లికేషన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఒడిశా రాష్ట్రానికి చెందిన గుణుపూర్ గైట్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ఎస్.శర్మ చేతుల మీదుగా సత్యనారాయణరాజుకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన డాక్టర్ పి.సత్యనారాయణరాజును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపీచంద్, స్వర్ణాంధ్ర ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.పండరీనాథ్, వివిధ విభాగాధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.



# బెట్టింగ్... టెన్షన్...!

◆అధినాయకుల ప్రకటనలతో పెరిగిన పందేల జోరు ◆ఫలానా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని భారీగా పందేలు
◆స్థానిక ఎంఎల్ఎ అభ్యర్థుల గెలుపుపై, మెజార్టీపై సై ◆ పలు నియోజకవర్గాల్లో ఒకటికి, రెండు చెల్లింపు పందేలు
◆సామాన్యులు సైతం పందేల ఊబిలోకి ◆ ఫలితాల సరళిపై లోలోన ఆందోళన

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

తమ పార్టీకే అత్యధిక సీట్లు వస్తాయని ప్రధాన పార్టీలైన టిడిపి కూటమి, వైసిపి అధినాయకుల ప్రకటనలతో పందేల జోరు మరింత పెరిగింది. మొన్నటి వరకూ ఎంఎల్ఎ గెలుపుపై పందేల జోరు సాగగా, ఇప్పుడు ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. గడిచిన రెండు రోజుల కాలంలో బెట్టింగ్‌రాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. నాయకుల ప్రకటనలతో సామాన్యులు సైతం పందేల ఊబిలో చిక్కుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఆయా పార్టీల అధినాయకుల ప్రకటనలు కేడర్‌లో ఉత్సాహం నింపేలా ఉన్నప్పటికీ చాలామంది సామాన్యులు సైతం ఆ మాటలతో పందేలకు దిగుతున్న పరిస్థితి జిల్లాల్లో కన్పిస్తోంది.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టిడిపి కూటమి, వైసిపి మధ్యనే అన్నట్లు పోటీ నడ్డాయి. ఆచంట, ఉండి, దెందులూరు, నూజివీడు వంటి నియోజకవర్గాల్లో పోటీ మరింత రసవత్తరంగా నడిచింది. ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో అంచనా వేయడం కష్టతరంగా మారింది. మిగిలిన నియోజకవర్గాల్లో పోటాపోటీగా ఎన్నికలు జరిగాయి. రెండు రోజుల క్రితం వరకూ ఎంఎల్ఎగా ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనే దానిపై పందేలు సాగాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఫలానా అభ్యర్థి గెలుస్తారంటూ ఒకటికి, రెండింతలు ఇచ్చేలా పందేలు కాసిన పరిస్థితి ఉంది. తాము చెప్పిన అభ్యర్థి గెలిస్తే రూ.లక్ష, మీరు చెప్పిన అభ్యర్థి గెలిస్తే రూ.రెండు లక్షలు ఇస్తామన్న రీతిలో పందేలు పట్టిన పరిస్థితి ఉంది. ఇటీవల కాలంలో వైసిపి, టిడిపి కూటమికి చెందిన అధినేతలు తమకు ఇన్ని సీట్లు వస్తాయని ప్రకటించడం పందేల జోరుకు మరింత ఊతమిచ్చింది. తమ పార్టీ అధినేత చెప్పారంటే పక్కా సమాచారం ఉంటుందని ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలతోపాటు సామాన్యులు సైతం అంచనా వేస్తున్నారు. దీంతో ఇటీవల కాలంలో జరుగుతున్న పందేల్లో రాష్ట్రంలో ఏపార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే అంశంపైనే పందేలు సాగుతున్నాయి. సామాన్యులు సైతం పందేలకు దిగడం కన్పిస్తోంది. ఎన్నికల బెట్టింగుల్లో సామాన్య ప్రజానీకం బలిపశువులుగా మారుతున్నారు. రబీ పంట ఇప్పుడే చేతికి రావడంతో సామాన్య రైతులు సైతం పందేలకు దిగుతున్నారనే చర్చ నడుస్తోంది. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చాల్సి ఉండగా ఆ సొమ్మును పందేలకు పెడుతున్నారని చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం ఉండగా అన్ని స్థానాలూ ఒక పార్టీ గెలుస్తుందని కొందరు, ఆ విధంగా జరగదని మరికొందరు పందేలు పడుతున్నారు. ఏలూరు జిల్లాలోనూ ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం ఉండగా మెజార్టీ స్థానాలు ఫలానా పార్టీ గెలుస్తుందని లెక్కలు వేసి పందేలు వేస్తున్న పరిస్థితి ఉంది. పోలవరం స్థానంపై మెజార్టీ పందేలు, సీటు పందేలు ఎక్కువగా సాగుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో తక్కువ లెక్కించినా రూ.20 కోట్లు వరకూ పందేలు సాగినట్లు అంచనా. ఉండి నియోజకవర్గంలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వేటుకూరి శివరామరాజుకు ఎన్ని ఓట్లు వస్తాయనే దానిపైనా పందేలు నడుస్తున్నాయి. రఘురామకృష్ణంరాజు గెలుపోటములపైనా ఆదేరీతిన పందేలు పడుతున్నారు. పందేల పేరుతో చాలామంది సామాన్యులు అప్పుల పాలయ్యే పరిస్థితి ఉంది. పార్టీల అధినాయకుల ప్రకటనలు నిండా ముంచే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రకరకాల ప్రకటనల ఆధారంగా బెట్టింగులు కాసిన పందెంరాయుళ్లంతా ఫలితాలు తర్వాత పరిస్థితి ఏమిటోననే భయం అందరినీ వెంటాడుతోంది.

## శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ సుమిత్‌కుమార్

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్వహించిన ఎన్నికల్లో రాత్రి పొద్దుపోయే వరకు క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడంతోపాటు శాంతియుత వాతావరణంలో ఎన్నికలను పూర్తి చేసుకుని మంచి పోలింగ్ శాతాన్ని నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను కట్టుదిట్టంగా పూర్తి చేసుకోవడానికి రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు, సంబంధిత శాఖలు నిరంతరం కృషి చేశాయని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు పోలింగ్ అనంతరం తెల్లవార్లు పని చేసి మిగిలిన సిబ్బందికి స్ఫూర్తిగా నిలవడంతోపాటు ఇవిఎంలను స్ట్రాంగ్‌రూముల్లో భద్రపర్చే ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. స్థానిక విష్ణు కాలేజీలో నాలుగు నియోజకవర్గాలకు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను మూడంచెల భద్రత మధ్య కట్టుదిట్టమైన పహారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సులను కూడా తరలించి స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచే ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఎప్పుడైనా స్ట్రాంగ్‌రూములను పరిశీలించుకోవడానికి అవకాశాన్ని కల్పించామని తెలిపారు. జిల్లాలో నేటి వరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో గొడవలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న దృష్ట్యా జిల్లాలోని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అటువంటి సంఘట నలకు తావు లేనప్పటికీ కౌంటింగ్ పూర్తయ్యి, ఆపై కొన్ని రోజులపాటు అందరినీ అప్రమత్తం చేస్తూ పరిస్థితులను సమీక్షిస్తామని తెలిపారు. ఎక్కడా కూడా శాంతిభద్ర తలకు విఘాతం కలిగించేలా గొడవలుగాని, దాడులు గాని, రాజకీయ పార్టీల కవ్వింపు చర్యలుగాని ఎట్టి పరిస్థి తుల్లో ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు ఉంటా యని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు, పోలీ సు శాఖ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరిగితే తక్షణమే స్పం దించి నియంత్రించేందుకు గట్టి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై ఎటువంటి అలజడులు వచ్చే అవకాశం ఉన్నా ఆరా తీయాలని ఆదేశించారు. అలాగే చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘాను కట్టుదిట్టం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పోటీల ప్రారంభంలో నృత్య ప్రదర్శన

## జాతీయస్థాయి నృత్య పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

బివిఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో జాతీయస్థాయి నృత్య పోటీలు బివీఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. సుమారు 200 మంది కళాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో భరతనాట్యం, కూచిపూడి, జానపదం తదితర నృత్యాలను ప్రదర్శించారు. జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాలుగా రెండు రోజులపాటు పోటీలు జరుగుతాయన్నారు. పోటీల సందర్భంగా హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన సీనియర్ కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బివిఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకటరామారావు, పిటి.వెంకన్న, దాసరి కాశీవిశ్వనాథం, పేరేచర్ల మురళీకృష్ణంరాజు, కొప్పిశెట్టి రమణయ్య, పైలు శ్రీనివాసరావు, సరస్వతుల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గండికోట రాజేష్, నండూరి రాధిక న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## 'ఉపాధి హామీ'కి నిధులు పెంచాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

**ప్రజాశక్తి - ఆచంట**

ఉపాధి హామీకి నిధులు పెంచి అన్ని రకాల పనులను కూలీలతో చేయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాప్రజాశక్తి - **ఆచంట**ం విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం సిపిఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో బలరాం మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు వరికోతలు పూర్తయిన సందర్భంగా పనుల్లేక ఖాళీగా ఉంటున్నారని, తక్షణమే వారికి ఉపాధి హామీ పనులు చూపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం బడ్జెట్లో రూ.లక్షా 19 వేల కోట్లు నుండి రూ.60 వేల కోట్లకు నిధులు కుదించి ఉపాధి కూలీలకు పనుల్లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధి హామీ నిధులు పెంచి అన్ని రకాల పనులనూ కూలీలతో చేయించాలని ఆయన కోరారు. కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.300 కూడా రావడం లేదని తెలిపారు. డెల్టా ప్రాంతంలో పంట, మురుగు కాలువలు, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయని అన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కీలకంగా మారాయని, నిధులు పెంచాల్సింది పోయి తగ్గిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.600 ఇచ్చి 200 రోజులు పని దినాలు కల్పించాలని, పాత పనిముట్ల స్థానంలో కొత్త పనిముట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వైద్య సహాయం అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులను అన్ని విధాలుగా ఆదుకునే చర్యలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశాల్లో కనీస వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, పి.మోహన్‌రావు, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి పాల్గొన్నారు.

# ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం..

ముద్దాయిలకు ఆహారాన్ని అందిస్తున్న జిల్లా జడ్జి డి.సత్యవతి

**ప్రజాశక్తి - తణుకు**

ఏ ఒక్కరూ అన్యాయానికి గురి కావద్దని, న్యాయవాదిని పెట్టుకోలేని, ఆర్థిక స్తోమత లేని వారికి మండల న్యాయసేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని మండల న్యాయసేవల కమిటీ, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. శనివారం స్థానిక తణుకు సబ్ జైల్‌ని న్యాయమూర్తి సత్యవతి సందర్శించారు. పురుష, మహిళా ముద్దాయిలను కలిసి వారి కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని, వారానికి రెండు రోజులు జైలు సందర్శనకి న్యాయవాది వస్తారని, వారికి సమస్యలు తెలిపిన యెడల వారు న్యాయ సలహా, సహాయం అందిస్తారని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎవి.నాగరాజు, ప్యానెల్ న్యాయవాదులు చింతపల్లి నాగేశ్వరరావు, ఎ.అజయకుమార్, టి.సత్యనారాయణ, తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి, జైల్ విజిటింగ్ డాక్టర్ శ్రీరాజ్, జైలు సూపరింటిండెంట్ జి.మోహనరావు పాల్గొన్నారు.

### సబ్ జైలును సందర్శించిన మేజిస్ట్రేట్ సురేష్ బాబు

**భీమవరం టౌన్:** భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం సబ్ జైలును స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్), జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ జి.సురేష్ బాబు శనివారం సందర్శించారు. న్యాయమూర్తి ముద్దాయిలతో నేరుగా మాట్లాడి వారి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేర ప్రవృత్తిని మానుకోవాలని సూచించారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు సంస్థ తరఫున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ శనివారం ఉచిత న్యాయవాది, వాలంటీర్లు జైలును సందర్శిస్తారని, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు ఉచిత న్యాయవాదులు బేతపూడి లోకేశ్వరరావు, ఎమ్.బి.భవాని, పారా లీగల్ వాలంటీర్ కె.కామేశ్వరి, జైలు సూపరింటెండెంట్ వెంకటగిరి పాల్గొన్నారు.


ముద్దాయిలతో మాట్లాడుతున్న సురేష్‌బాబు

## పూర్వ కమిషనర్ శామ్యూల్‌పై చర్యలు తీసుకోవాలి

### ఆర్‌డిఒకు టిడిపి నేతల వినతి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

గతంలో తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ఎ.శామ్యూల్‌పై చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్యకు టిడిపి పట్టణాధ్యక్షులు పట్నాల రాంపండు, కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎ.శామ్యూల్ ఈ నెల 3న భీమవరం కలెక్టరేట్‌కు బదిలీ అయినప్పటికీ సెలవులో ఉండి ఇక్కడ ప్రభుత్వ వాహనం వాడుతూ, తాడేపల్లిగూడెంలోని తన ఇంటి వద్ద ముగ్గురు శానిటరీ సిబ్బందిని తన సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. అవినీతిలో కూరుకుపోయిన కమిషనర్ శామ్యూల్‌పై తగు చర్యలు తీసుకుని, ప్రజాధనం వృధా కాకుండా చూడాలని కోరారు. అనంతరం ఇదే వినతిపత్రాన్ని తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ డి.మురళీకష్ణకూ అందజేశారు.


ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నేతలు

# అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

### ఉండిలో సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్

**ప్రజాశక్తి - ఉండి**

సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, అలజడులు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ అన్నారు. శనివారం సాయంత్రం ఉండి మెయిన్ సెంటర్‌లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో కొన్ని పార్టీలకు చెందిన నేతలు విధ్వంసాలు సృష్టించారని వాటిని పురస్కరించుకుని ఉండి మండలంలోని గ్రామాలలో ఎటువంటి సమస్యలు, అలజడులు సృష్టించినా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలకు భరోసా కల్పించి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పించి అల్లర్లు సృష్టిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, పోలీసు వారికి, అధికారులకు ఓటర్లందరూ సహకరించాలని వారు సూచించారు.

ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**ప్రజాశక్తి - ఉండి**

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయాలలోని పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి జక్కంపూడి వెంకట కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం ఉండి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కావలసిన నీతి కథల పుస్తకాలను, స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలను, చరిత్రకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచామని విద్యార్థులు ఈ పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పొందుతారని అన్నారు.

ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌టిసి యాజమాన్యం

## ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

### ఆర్‌టిసి డిపో గ్యారేజ్ ఇన్‌ఛార్జి కె.చిట్టిబాబు

**తాడేపల్లిగూడెం:** ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేయండి.. బహుమతులను పొందండని తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో గ్యారేజ్ ఇన్‌ఛార్జి కె.చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పదిహేను రోజులకు జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లలో ప్రయాణం చేసేవారు తమ టికెట్ వెనుక పేరు, మొబైల్ నెంబర్ రాసి బస్సుల్లో ఉన్న గిఫ్ట్ బాక్స్‌లో వేయవలెనన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రయాణం చేసిన వారి టికెట్లు శనివారం ఉదయం 12 గంటలకు తాడేపల్లిగూడెం బస్ స్టేషన్‌లో ప్రయాణీకుల సమక్షంలో లక్కీ డీప్ నిర్వహించారు. లక్కీ డ్రా విజేతలకు బహుమతులను తాడేపల్లిగూడెం జివి.మాల్ వారి సౌజన్యంతో ప్రతి పదిహేను రోజులకు లక్కీ డీప్ ద్వారా డ్రా తీసి బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి యూనియన్ నాయకులు రమణ, విజయకుమార్ పాల్గొన్నారు.

# అంచనాల్లో నేతలు.. సమస్యల్లో ప్రజలు

పోలింగ్ ముగిసింది. ఫలితాల కోసం నిరీక్షణ మిగిలింది. అభ్యర్థులు, వారి అనుయాయులు కూడికలు, తీసివేతల్లో బిజీగా ఉన్నారు. రాజకీయ నేతలు, పందెంరాయుళ్లు గెలుపోటములపై అంచనాల్లో తలమునకలయ్యారు. అధికారులు స్ట్రాంగ్‌రూముల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరి రెండు నెలలుగా ఎన్నికల కోడ్ పేరుతో పక్కన పెట్టిన ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే లేడా అనే ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది.

ప్రజా సమస్యలను ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తే సామాన్యులే తిరగబడతారనే దానికి ఏలూరు జిల్లాలోని చింతలపూడి, కొయ్యలగూడెం మండలాల్లో ప్రజలు పోలింగ్ బహిష్కరణకు సిద్ధపడటమే నిదర్శనం. ఏళ్ల తరబడి రోడ్డు సమస్య పరిష్కరించడం లేదంటూ చింతలపూడి మండలం దేశవరం గ్రామస్తులు పోలింగ్ బహిష్కరించారు. స్థానిక అధికారులు, నేతలు నచ్చజెప్పినా ససేమిరా అనడంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని జిల్లా అధికారులు హామీ ఇవ్వడంతో దేశవరం గ్రామస్తులు శాంతించి పోలింగ్‌లో పాల్గొన్నారు.

ఇదే పరిస్థితి కొయ్యలగూడెం మండలం వంకబొత్తప్పగూడెం పోలింగ్ కేంద్ర పరిధిలో చోటుచేసుకుంది. కొయ్యలగూడెం, టి.నర్సాపురం మండలాల్లోని గిరిజన గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి ఐటిడిఎ పరిధిలోకి తీసుకురావాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. దీనిపై నేతలు ప్రకటనలు గుప్పించడం మినహా కార్యాచరణకు ప్రయత్నించిన దాఖలాల్లేవు. దీంతో ఆగ్రహించిన వంకబొత్తప్పగూడెం పోలింగ్ కేంద్రం పరిధిలోని నాలుగు గిరిజన

గ్రామాల ప్రజలు పోలింగ్ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆగమేఘాల మీద రంగంలోకి దిగిన అధికారులు పలుదఫాలుగా చర్చల అనంతరం ఆ గ్రామాల గిరిజనులు ఎట్టకేలకు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ రెండు ఘటనలు జిల్లాలో పేరుకుపోయిన అపరిష్కృత సమస్యలను చెప్పకనే చెబుతున్నాయి.

ఇక ఏజెన్సీలోని కుక్కునూరు మండలం దామరచర్ల పంచాయతీ పరిధిలోని కురుములతోగులో ఇద్దరు గిరిజనులు అతిసారతో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. సుమారు 23 ఏళ్లుగా అక్కడ సుమారు 50కుపైగా కుటుంబాలు నివశిస్తున్నా ఇప్పటికీ రోడ్డు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు మాత్రం లేకపోవడం గమనార్హం. తమ హయాంలో ప్రతి మారుమూల గిరిజన గ్రామానికీ విద్యుత్ సౌకర్యం కల్పించామని నేతలు గొప్పగా ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయనే దానికి ఈ గ్రామమే నిదర్శనం. తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీరు పంపి, వైద్య శిబిరం ఏర్పాటు చేసి హడావుడి చేస్తున్న అధికారులు సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు ఎప్పటికి తీసుకుంటారో వేచిచూడాలి. అదే మండలంలోని పలు గ్రామాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదనేది బహిరంగ రహస్యం. ఇప్పటికీ ఆయా గ్రామాల నుంచి డోలిపైనే రోగులను, గర్భిణులను, వృద్ధులను తీసుకొచ్చే పరిస్థితి ఉందంటే నమ్మక తప్పదు. ఈ సమస్యలేవీ ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలోగాని, నేతల మాటల్లోగానీ ప్రస్తావనకు రాలేదు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా అటు అధికారపక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షం సైతం పరస్పర విమర్శలు, డబ్బు ప్రభావాన్నే నమ్ముకుని ముందుకు సాగడం బాధాకరం. మరి ఫలితాలు వచ్చాక కొలువుదీరే కొత్త ప్రభుత్వం, ప్రజాప్రతినిధులైనా ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తారో లేక ఎప్పటిలానే ముఖం చాటేస్తారో వేచిచూడాలి.

**-వియస్ఎస్‌వి.ప్రసాద్**

వేసవి శిక్షణా కేంద్రంను సందర్శించిన సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు

## వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు

**ప్రజాశక్తి - పాలకొల్లు**

వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు కోరారు. పాలకొల్లు శాఖ గ్రంథాలయంలో పక్షం రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ఆర్టికల్స్‌ను పరిశీలించి అభినందించారు. గ్రంథాలయ సభ్యులు జి.సీతారాం, వి.వెంకట్రావు, డి.పాండురంగారావు, కెవివి సత్యనారాయణ లైబ్రరీయన్ వి.శాంత కుమారి పాల్గొన్నారు.

## చేతికి అందినది.. నోటికి అందుతుందా?

### ఆందోళనలో రైతులు

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

అనేక కారణాలతో ఆకుమడులు పోయడం ఆలస్యమైందని రైతులు, కౌలు రైతులు కొందరు ప్రస్తుతం అకాల వర్షాలకు తాము దొరికిపోయామని ఆందోళన చెందుతున్నారు. పంట బాగా పండిందని సంబరపడ్డ కొద్ది రోజులకే వాతావరణంలో మార్పు వల్ల చేతికి అందిన పంట నోటికి అందకుండా పోతుందని వారు వాపోయారు. ఎన్నికల పోలింగ్‌కు ముందే కోసిన పంట నూర్పిడి చేసే సమయానికి మాయదారి వర్షం ప్రారంభమై మాతో దోబూచులు ఆడుతూ నష్ట పెట్టిందని పలువురు పెనుమంట్ర, ఆలమూరు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడెక్కడో రోడ్ల పక్కన ఉన్న ధాన్యం రాసుల్ని, బస్తాలను, పనలను కాపాడుకొనే పనుల్లో వారున్నారు.


కొవ్వలి రామ్మోహన్ నాయుడును సత్కరిస్తున్న పొన్నపల్లి వాసులు

## యతిరాజ రామ్మోహన్ నాయుడు సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి - నరసాపురం**

ఆపదలో ఉన్న తమతో పాటు ఎంతోమందికి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆపద్బాంధవుడిగా చేయూతను ఇవ్వడం గొప్ప విషయమని పలువురు అభినందించారు. పట్టణంలోని 2వ వార్డు పొన్నపల్లికి చెందిన బస్వాని రాము, బస్వాని రాంబాబు, బస్వాని వెంకటేశ్వర్లు, బస్వాని లక్ష్మి కుటుంబాలకు చెందిన తాటాకిళ్లు కొద్దిరోజుల క్రితం అగ్నిప్రమాదంలో దగ్ధమైయ్యాయి. వెంటనే స్పందించిన కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆ బాధితులకు అండగా నిలిచారు. నిరాశ్రయులైన కుటుంబాలకు రూ.1.28 లక్షల ఆర్థికసాయాన్ని అందించి మానవత్వాన్ని చాటారు. ఈ సందర్భంగా శనివారం రామ్మోహన్ నాయుడు సేవలు కొనియాడుతూ బాధితులు చిరు సత్కారం చేశారు. భవిష్యత్తులో కూడా మరింత సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నమండ నాగేశ్వరరావు, పొన్నాల నాగబాబు, తిరుమానీ శశిదేవి, పెమ్మాడీ శ్రీదేవి, జక్కం శ్రీమన్నారాయణ, సంకు భాస్కరనాయుడు, గుగ్గులపు బుజ్జిబాబు, వేపూరి వాసు ఉన్నారు.

యాత్రికులతో కిటకిటలాడుతున్న కాళ్లకూరు వెంకటేశ్వరాలయం

## యాత్రికులతో వెంకటేశ్వర ఆలయం కిటకిట

**ప్రజాశక్తి - కాళ్ల**

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళ్లకూరు గ్రామంలో 600 ఏళ్ల పైబడిన చరిత్ర కలిగిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం యాత్రికులతో కిటకిటలాడింది. శనివారం కావడంతో యాత్రికులు పెద్ద ఎత్తున క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని పెండ్లి కుమారుని చేశారు. తులసీదళములతో విశేషార్చన నిర్వహించారు. 19న స్వామివారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. 28 వరకూ వళాయితీ ఉత్సవాలు జరుగుతాయి. జూన్ 1న అఖండ అన్నసమారాధన జరుగుతుందని ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు.

స్టీల్ ప్లేట్లు బహుకరిస్తున్న భవానీ శంకర్ దంపతులు

## ఆలయానికి స్టీల్ ప్లేట్లు, బకెట్లు బహూకరణ

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పట్టణ పరిధిలోని యడ్ల బజార్‌లో కొలువైన పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంకు భక్తుల ప్రసాదం, సౌకర్యానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు రాయపూడి భవానీ శంకర్ ప్రసాద్ దంపతులు రూ.10 వేల విలువ గల స్టీల్ ప్లేట్లు, స్టీల్ బకెట్లు అందజేశారు. ఈమేరకు శనివారం ఆలయ ప్రధాన అర్చకులు రమణ స్వామికి అందజేశారు. ప్రతి మంగళవారం భక్తులు, యాత్రికులకు పౌష్టికాహారం, జావా, ఇతర టిఫిన్‌లు అందజేయడం పట్ల వారు ఆలయ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రసాద్ దంపతులకు స్వామి వారి ప్రసాదాలు, ఫోటో అందజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# ప్రజారోగ్యంతో మత్స్యశాఖ చెలగాటం

**కుళ్లిన కోడిగుడ్లు, కోళ్లవ్యర్థాలే చేపలకు మేత**

**చర్మ వ్యాధులు, క్యాన్సర్, కిడ్నీ, లంగ్స్ రోగాల బారిన పడుతున్న ప్రజలు**

**అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం**

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

చేపల సాగులో నష్టాలను నివారించుకోవాలనే ఉద్దేశంతోనో, అధిక లాభాలు సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతోనో లేక పెట్టుబడులు తగ్గించుకోవాలనో రైతులు ప్రజా ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. చేపల చెరువుల్లో చేపలకు మేతగా కుళ్లిపోయిన కోడిగుడ్లు, కోళ్ల వ్యర్థ పదార్థాలను, రెస్టారెంట్‌లో మిగిలిపోయిన బిర్యానీలు వేస్తున్నారు. అక్రమాలను సక్రమంగా వ్యవస్థలను గాడిలో పెట్టవలసిన అధికారులు నెలవారి మామూలు చేపల మేతలాగా మేసేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేలకు వేలు ప్రజాధనాన్ని జీతాలుగా తీసుకుంటున్న మత్స్యశాఖ అధికారులు కేవలం నామమాత్రపు తనిఖీలు చేసి ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు కూడా లేవనే చెప్పాలి..

జిల్లాలో భీమవరం, ఉండి, నరసాపురం, ఆకివీడు, గణపవరం మండలాల్లో ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలో 49040 వేల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. ప్రతియేటా ఇక్కడి నుంచి దాదాపు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏడాదికి రూ.14 వేల కోట్లకుపైగా ఆదాయం తెచ్చిపెడుతుంది. సుమారు లక్ష పైగా ఎకరాలు చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. రైతుల నిబంధన ప్రకారం పర్యావరణానికి ముప్పు లేకుండా నాణ్యమైన తవుడు, చెక్క, కనికలు వంటివి చేపలకు మేతగా వేయవలసి ఉంది. అయితే రైతులు అవేవీ పెట్టకుండా నిత్యం

చెరువు వద్ద నిలువ చేసి ఉన్న కోడిగుడ్లు

మార్కెట్‌లో కుళ్లిపోయిన కోడిగుడ్లు, కోళ్ల వ్యర్థాలు, రెస్టారెంట్లలో మిగిలిపోయిన వ్యర్థాలను వ్యాన్లపై బహిరంగంగా పట్టికెళ్తారు. వీళ్ల నుంచి కొన్ని శాఖల అధికారులు ముఖ్యంగా మత్స్యశాఖ అధికారులు


చేపలకు మేత వేసేందుకు సిద్ధంగా కోడిగుడ్లు, వ్యర్థాలు

మామూలు తీసుకుంటారని ఆరోపణలు లేకపోలేదు. కొందరు అధికారులు జీతాలు తీసుకోవడమే తప్ప ఆ శాఖలో ఏమి జరుగుతుందో ఏమిటో వారికే తెలియదని, దీనికంతటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణమనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు వ్యక్తిగత పనుల మీదే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్వా సాగుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో కాలువలు, డ్రెయినేజీ వ్యవస్థతో పాటు కలుషితమయ్యాయి. దీంతో ఈ ప్రాంతం వేల సంఖ్యలో చర్మ వ్యాధి, క్యాన్సర్, కిడ్నీ, లంగ్స్, ఇన్ఫెక్షన్ వంటి రోగాలతో ఎంతోమంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఎంతో మంది ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా మరణిస్తున్నారు కూడా. అయినా ఈ అధికారులలో చీమంతైనా చలనం లేదు. వేలకు వేలు జీతాలుగా తీసుకుంటున్నా.. మన ఆలోచన వృత్తి ధర్మాన్ని పాటించాలని, రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని లేదని గ్రామాల్లో ప్రజలు మండిపడుతున్నారు. మరోపక్క ఇలాంటి వ్యర్థాలతో ఆక్వాసాగులు చేయడం వల్ల పర్యావరణం కూడా మరింత క్షీణించి ప్రజల ఆరోగ్యంపై పెను ప్రమాదం చూపిస్తుంది. ఎంతో విజ్ఞానం కలిగిన అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరించడంపై పర్యావరణ వేత్తలు కన్నెర్ర చేస్తున్నారు. భీమవరం మండలంలోనే ఎక్కువ. భీమవరం మండలం గోట్లపాడు, దొంగపిండి ప్రాంతాల్లో ఈ కుళ్లిపోయిన కోడిగుడ్లు చేపలకు మేతలుగా ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఆయా ప్రాంత ప్రజలే బహిరంగంగా చెబుతున్నారు. ఇక్కడే భీమవరం కేంద్రంగా జిల్లా మత్స్యశాఖ ఉన్నప్పటికీ అధికారులు ఇటుపై కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ ప్రాంతంలో కుళ్లిన వ్యర్థాలను చేపలకు వినియోగించడం వల్ల కాలువలలో సైతం నీరు కలుషితమై వెదజల్లుతున్నాయని, దీంతో పశువులు కూడా ఈ నీటిని తాగలేకపోతున్నాయని, అయినా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ తమ గోడును ఎవరూ పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చేపలకు ఎటువంటి మేతలు వేయాలో, ఎటువంటి మేతలు వేస్తే జలాలు కలుషితం కావో వాటిని మాత్రమే వినియోగించేలా మత్స్యశాఖ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, తీసుకున్న జీతానికి తగిన న్యాయం చేయాలని ప్రజలు, చేపల ప్రియులు ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులని ముక్తకంఠంతో వేడుకొంటున్నారు.

# పాసింజర్ రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు

**తగిన ఏర్పాట్లు చేయాలి : డిఆర్‌సి మెంబర్ జక్కంపూడి**

**ప్రజాశక్తి - పాలకొల్లు**

నరసాపురం నుంచి నడిచే ఫాస్ట్ పాసింజర్, డెమో రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని డిఆర్‌సి మెంబర్ జక్కంపూడి కుమార్ రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. విజయవాడ - గుంటూరు ట్రాక్ మరమ్మత్తులు నిమిత్తం నరసాపురం నుంచి నడిచే (17282, 07897, 07771, 17270, 07862, 07883) రైళ్ల రద్దు వల్ల ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. నరసాపురం, పాలకొల్లు, భీమవరం, కైకలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, గుంటూరు, విజయవాడ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వేసవి సెలవులు కావడం, కాలేజీ జాయినింగ్ సీజను వల్ల ఉన్నత చదువుల కోసం ప్రయత్నించే విద్యార్థులు హాస్పిటల్స్ నిమిత్తం విజయవాడ, హైదరాబాద్ వెళ్లేవారు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాలకు, హైకోర్టులో పనులు చెక్కబెట్టుకొనువారు, కనెక్టింగ్ ట్రైన్స్ ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లే అన్ని వర్గాల ప్రజలకు ఈ రైళ్ల రద్దు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రామవరప్పాడు దగ్గరలో అనేక విద్యా సంస్థలు ఉన్నాయని, విద్యార్థులకు హాస్టల్స్ అనేక స్కూల్స్, కాలేజీలు ఉన్నవని తెలిపారు. ఈ రైలు రూటు రామవరప్పాడు వరకు 2 రైళ్లు వెళ్లి రావడానికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొనే ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దయచేసి వెంటనే ఈ సమస్యపై దృష్టిసారించి ప్రయాణికులకు, ప్రజానీకానికి ఇక్కట్లు తప్పించాలని తెలిపారు.

పూడుస్తున్న వరిచేలు


ఆకివీడు వెంకయ్య కాలవ గట్టున పూడుస్తున్న వరిచేలు

# పూడుకుపోతున్న వరి చేలు..

**పట్టించుకోని అధికారులు**

**ఆవేదనలో రైతులు**

**ప్రజాశక్తి - ఆకివీడు**

వరిచేలు పూడుకు పోతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో 50 శాతం వరిచేలు ఆక్వా చెరువులుగా మారిపోయాయి. మరో 5 శాతం ఇప్పటికే పూడ్చివేశారు. ఇక మిగిలిన 45 శాతం వరి చేలలో మళ్లీ పూడికలు మొదలయ్యాయి. వ్యవసాయాన్ని కాపాడాల్సిన అధికారులు జేబులు నింపుకుంటున్నారు తప్ప అడ్డుకోవడం లేదు. ఆక్వాలో ఆదాయం మరింత మెరుగ్గా ఉండటంతో గతంలో వరిచేలన్నీ చేపల చెరువులుగా మారిపోయాయి. ఎక్కడికక్కడ చేపల గుంటలు, రొయ్యల గుంటలుగా వెలిశాయి. అయితే మధ్యలో కొంతకాలం ఈ తవ్వకం ఆగింది. చేపలకు లాభసాటి ధరలు పలకకపోవడం, మందుల మేతలు ధరలు పెరిగిపోవడంతో వరిచేలు కొనసాగుతున్నాయి. చేపల చెరువులకు ఆనుకుని ఉన్న వరిచేలు పంట దిగుబడులు తగ్గిపోయి రైతులు ఇప్పటికే భారీగా నష్టపోయారు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ బ్రోకర్లు రంగంలోకి దిగుతున్నారు. డెవలప్మెంట్ పేరుతో పంట చేలను పూడ్చివేసి పూర్తి బిట్లుగా వేసి అమ్ముతూ వస్తున్నారు. ఇదిలా ఉండగా సుమారు గత నాలుగు సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ రంగం పడిపోయింది. ఈ స్థితిలో స్థలాలు గతంలో పూడ్చినవి అలా ఉండిపోయాయి. ఇప్పుడు ప్రస్తుతం ప్రభుత్వం మారుతుందని ఆశాజనకమైన పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ తిరిగి పుంజుకుంటుందని ఆశలు చిగురుస్తున్నాయి. ఈ స్థితిలో పంటచేలు తిరిగి పూడికలు మొదలుపెట్టారు. ఇప్పటికే వరి పంట దిగుబడి తగ్గిపోయి ఇక్కడ అందరూ బియ్యం కొనుక్కునే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈ ప్రాంతంలో బియ్యం ఎవరూ కొనుక్కున్న దాఖలా లేదు. ఉత్పత్తి అయిన ధాన్యంలో కొంత ధాన్యం తిండికి పోగా పదో వంతు ధాన్యం మాత్రమే ఇక్కడ దుకాణాల్లో వ్యాపారం సాగేది. ఆ వ్యాపారం కూడా అతి తక్కువగా సాగేది. ఎక్కువ ధాన్యం ఇక్కడి నుంచి ఎగుమతి అయ్యేవి. ఇప్పుడు ధాన్యం ఎగుమతి అయ్యే పరిస్థితి లేదు కదా బియ్యం దిగుమతి భారీగా అవుతున్నాయి. ఒకపక్క చెరువుల తవ్వకం, మరోపక్క పంటచేలా పూడికలు ఇలాగే జరుగుతూ పోతుంటే మరి కొంత కాలానికి ఈ ప్రాంతంలో బియ్యం కేజీ ప్రస్తుతం ఉన్నదానికి పదిరెట్లు అమ్మినా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు నిపుణులు. అయితే చట్ట ప్రకారం ఇక్కడ చేలను పూడ్చడానికి కావలసిన మట్టి తవ్వకానికి గనుల శాఖ అనుమతి ఇవ్వవలసి ఉంటుంది. అనంతరం స్థానిక ప్రభుత్వం పంచాయతీ లేదా మున్సిపాలిటీ అనుమతి ఇవ్వాలి. వీరిద్దరితో పాటు రెవెన్యూ శాఖ కూడా అనుమతి ఇవ్వాలి. ఇప్పుడు ఏ ఒక్క శాఖ అనుమతి వీరికి లేదు. సాధారణంగా ఇక్కడ అక్రమ పూడికలే 50 శాతం పైగా జరుగుతూ ఉంటాయి. గరుడ శాఖ కోసం ఎంతో దూరం వెళ్లవలసి ఉంటుందని ఎవరూ ఆ ప్రయత్నం చేయరు. ఇదే అవకాశంగా తీసుకుని స్థానిక అధికారులు తమ జేబులు నింపుకోవడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం ఇక్కడ అదే పరిస్థితి కొనసాగుతోంది. కాగా ఈ పూడికలను అడ్డుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. అసలు పూడికలు ఎక్కడ జరుగుతున్నాయి, ఎలా జరుగుతున్నాయి మేం ఎవరికీ అనుమతి ఇవ్వలేదు జరగవు అంటున్నారు. ఇది ఒక రకంగా, మరో రకంగా చోటా అధికారులు బ్రోకర్లు జేబులు శుభ్రంగా నింపుకుంటున్నారు. ఎన్నికలను అడ్డం పెట్టుకుని ఇప్పటి వరకూ సందట్లో సడేమియా అంటూ ఇదే అవకాశంగా తీసుకుంటున్నారు. చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారీ అవకాశవాదులు. మొత్తం మీద ఎన్నికల సమయంలో బ్రోకర్లకు, క్రింది స్థాయి అధికారులకు బాగా కలిసి వచ్చినట్టుగా ఉంది. కౌంటింగ్ పూర్తయి శాశ్వతమైన అధికారులు వచ్చేసరికి ఇక్కడ రూపురేఖలు పూర్తిగా మారిపోయే స్థితి కనిపిస్తోంది.

# పెనుమంట్రలో గోనె సంచులకు కొరత లేదు

**వ్యవసాయ శాఖ అధికారి జ్యోషిలా**

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మండలంలో ధాన్యం పట్టుబడి కోసం రైతులకు అందజేసే గోనె సంచులకు కొరత లేదని వ్యవసాయశాఖ అధికారిణి ఎ.జ్యోషిలా వెల్లడించారు. శనివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇప్పటి వరకూ రైతులకు ఎకరాకి వంద సంచులు వంతున 9.50 వేల సంచులు పంపిణీ ఆయా ఆర్‌బికె, పిపిసిల ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు.

మండలంలో 41.125 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకూ సుమారు 30.02 టన్నులు రైతుల నుంచి కొనుగోలు చేశామని ఆమె పేర్కొన్నారు. ఇంకా కొన్ని చోట్ల దాళవా వరి మాసూళ్లు జరుగుతున్నాయని, ఎవరికీ సంచులు అవసరం ఉన్నా ఆర్‌బికెల వద్ద ఉన్న స్టాక్ నుంచి తీసుకోవచ్చని ఆమె వెల్లడించారు.

గోనె సంచులను పంపిణీ చేస్తున్న అధికారులు

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**ఆచంట రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు**

**ప్రజాశక్తి - ఆచంట**

ఆచంట నియోజకవర్గానికి సంబంధించి పోలింగైన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, పివి ప్యాడ్లు భీమవరం సీతా పాలిటెక్నిక్ కాలేజీలో జాగ్రత్తగా భద్రపరిచినట్లు ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు. శనివారం ఆచంట తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆచంట నియోజకవర్గానికి సంబంధించి స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఏదైనా సంఘటనపై స్పందించే క్రమంలో ప్రజలు మీడియా సమన్వయం పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మీ, పోలీస్ ప్రొడక్షన్ ఫోర్స్, స్టేట్ పోలీస్ టీంలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం చిత్రీకరణ, 24 గంటల పర్యవేక్షణ, మూడంచెల భద్రతతో కూడిన పహారా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో కూడా 144 సెక్షన్ అమల్లో ఉందని, జూన్ 4వ తేదీ వరకూ ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయపరమైన సమావేశాలు నిర్వహించడం నిషేధమన్నారు. గ్రామాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆయా అభ్యర్థుల అభిమానులు సమన్వయంతో వ్యవహరించి యంత్రాంగానికి సహకరించాలని స్వామి నాయుడు తెలిపారు.

వేములదీవిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాశక్తి - నరసాపురం**

వేసవిలో బాటసారులు దాహం తీర్చేందుకు వేములదీవి గొందిమూల సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేములదీవి కాపులకొడప వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయానికి నడిచి వెళ్లే భక్తులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామానికి చెందిన తిరుమాని శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

## ఎప్ సెట్ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీసూర్య విద్యార్థిని

**ప్రజాశక్తి - నరసాపురం**

శనివారం విడుదలైన తెలంగాణ ఎప్ సెట్ 2024 ఫలితాల్లో రాష్ట్రాలతో సంబంధం లేకుండా ప్రతిభను ప్రదర్శించడంలో ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటాం అని మరోసారి నిరూపించారు నరసాపురం శ్రీసూర్య కళాశాల విద్యార్థులు. ఈ సందర్భంగా శ్రీసూర్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడుతూ తెలంగాణ ఎప్ సెట్ 2024 ఫలితాల్లో తమ విద్యార్థిని అకి భావన 3443 ర్యాంక్ సాధించడంతో పాటు మరో ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సొంతం చేసుకుని నరసాపురం పట్టణానికి మంచి పేరు తీసుకొచ్చారని, ఇలాంటి మరిన్ని విజయాలు వీరందరు సాధించాలని అభినందనలు తెలిపారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఘంటసాల సూర్య నారాయణ, అకాడమిక్ అడ్వైజర్ బోయి రామచంద్రారెడ్డి, సీనియర్ అధ్యాపకులు ఎఆర్ఎస్ కుమార్, డాక్టర్ ఫాజల్, డాక్టర్ జానకీరామ్, కడలి త్రిమూర్తులు, చౌదుల కరుణ్ కుమార్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న మహేశ్వర రావు

## వ్యాధి నిరోధక టీకాలు వాడాలి

### జిల్లా వైద్యశాఖాధికారి మహేశ్వరరావు

**ప్రజాశక్తి - గణపవరం**

వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా తీసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారి డి.ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో బిపి, షుగర్ ఉన్నవారు తప్పనిసరిగా మందులు తీసుకొని తగిన వైద్యం పొందాలని అన్నారు. గర్భిణీ స్త్రీలు మూడు నెలల్లోపు నమోదు చేసి వారికి తగిన సేవలందించాలని తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లోరినేషన్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధికారులకు వివరించారు. అనంతరం సరిపల్లిలో ఉన్న వడ్డీ గూడెం ఏరియాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి, కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిదంబరానికి కాపు సంఘం నేతల సత్కారం

**నరసాపురం:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, నరసాపురం కాపు బిడ్డ కలిగినిడి చిదంబరం తొలిసారిగా ఆదివారం పట్టణానికి విచ్చేశారు. ఆయనను చినమామిడిపల్లి స్వగృహంలో నరసాపురం నియోజకవర్గం కాపు సంఘ నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి కృష్ణ పాల్గొన్నారు.